సాక్షి ములుగు

ఆదివారం । 5 । మార్చి । 2023



వరంగల్ అంటే ఇష్టం

పోరాటాల పురిటిగడ్డ ఓరుగల్లు అంటే తనకు ఇష్ట మని వెంకయ్యనాయుడు అన్నారు. శనివారం చైతన్య డీమ్డ్ టు బి విశ్వవిద్యాలయం స్నాతకోత్స వంలో పాల్గొని ప్రసంగించారు. - 8లో▸



గొట్లకొండలో యోగా కేంద్రం

నెక్కొండ మండలంలోని రెడ్లవాడ శివారు గొట్ల కొండలో అంతర్జాతీయ యోగా కేంద్రం ఏర్పా టుకు కృషి చేస్తున్నట్లు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
$36^0/20^0$

జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఆదివాసీ వికాస్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షురాలిగా ధనలక్ష్మి



మంగపేట: మండలంలోని రాజుపేటకు చెందిన మాజీ ఎంపీటీసీ కొమరం ధనలక్ష్మిని తెలంగాణ వికాస్ పరిషత్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలుగా నియమించినట్లు జాతీయ మహిళా శాఖ అధ్యక్షురాలు డాక్టర్ ఊర్మిలా సింగ్ మార్కో నియామకపత్రాన్ని ధనలక్ష్మికి అందజేశారు. తెలంగాణ వికాస్ పరిషత్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా ధనలక్ష్మి బాధ్యతతో సామాజిక వర్గ అభివృద్ధికి, రాజ్యాంగపరమైన అవకాశాలను వారికి చేరేలా నిబద్ధతతో బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ధనలక్ష్మిని నియమించడం పట్ల తెలుగు రాష్ట్రాల వికాస్ పరిషత్ శ్రీ మేనకా సింహాచలం, అఖిల భారతీయ ఆదివాసీ వికాస పరిషత్ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమరలం లక్ష్మణ్‌రావు, కేంద్ర కమిటీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు

ఏటూరునాగారం: మండలకేంద్రంలోని సామాజిక ఆస్పత్రిలో చిన్నారుల కోసం ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు డాటా ఎంట్రీ ఆపరేటర్ సంతోష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులకు ఇక్కడ ఆధార్ నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట, తాడ్వాయి, వాజేడు, వెంకటాపురం(కె) మండలాలకు చెందిన చిన్నారులను ఈ కేంద్రానికి సేవలను ఉపయోగించుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం 99481 15550 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



ములుగు: నెగ్లెక్టెడ్ ట్రాపికల్ డిసీసెస్(ఎన్‌టీడీ)పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ వరంగల్ జోనల్ కో ఆర్డినేటర్ డాక్టర్ శిరీషపటేల్ సూచించారు. శనివారం జిల్లాకేంద్రంలో వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య, ప్రోగ్రాం అధికారి డాక్టర్ పోరిక రవీందర్‌తో చర్చించారు. లెప్రసీ, ఫైలేరియా, డెంగ్యూ వ్యాధుల ప్రభావం, నిర్ధారణ పరీక్షలు, అందిస్తున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. వ్యాధులపై అవగాహనకు సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా వ్యాధులు సంభవించే ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెంచాలని అన్నారు. డీఎంహెచ్‌ఓ అప్పయ్య మాట్లాడుతూ జిల్లాలో మొదటి నుంచి వ్యాధులపై అప్రమత్తంగా ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మానిటరింగ్ అధికారులు, సీహెచ్‌ఓ దుర్గారావు, డీపీఎంఓ సాంబయ్య పాల్గొన్నారు.

నేడు కాళేశ్వరాలయంలో పండుగ

కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి రోజున శ్రీశుభానంద–ముక్తీశ్వరస్వామి కల్యాణం జరిగి ఆదివారానికి 16రోజులు అవుతున్నందున ఉత్సవమూర్తులకు 16వ రోజు పండుగ కల్యాణం జరిపించనున్నట్లు ఈఓ మహేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాళేశ్వరాలయంలోని కల్యాణ మండపం వద్ద ఉదయం 10.30గంటలకు కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం 1.30గంటలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఈఓ కోరారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

జిల్లా జూనియర్ సివిల్ జడ్జి రామచంద్రరావు

గణపురం: చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని జిల్లా జూనియర్ సివిల్ జడ్జి రామచంద్రరావు సూచించారు. దిశ ప్రాజెక్ట్ స్కీంలో భాగంగా శనివారం మండలంలోని చెల్పూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జడ్జి రామచంద్రరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్త్రీలు, అంగవైకల్యంగల పిల్లల హక్కులు, బాధితుల అక్రమ రవాణా, సాముహిక విపత్తు బాధితులు, బాల్యవివాహాలు, షీటీం, డయల్ 100, ఫోక్సో చట్టం, మహిళలపై వేధింపులు, విద్యాహక్కుచట్టంపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఎస్సై అభినవ్, సర్పంచ్ మధుసూదన్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జుమ్మునాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళ

వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ సుమలత



సామాజిక ఆస్పత్రిలో పరీక్షలు చేస్తున్న దృశ్యం(ఫైల్)





మంగళవారం మహిళలకు ఆరోగ్య రక్ష

- మార్చి 8 నుంచి ప్రారంభం
- జిల్లాలో రెండు ఆస్పత్రులు ఎంపిక

ఏటూరునాగారం: మహిళలు ప్రధానంగా ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఆయా రుగ్మతలను గుర్తించేందుకు ప్రతీ మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించడానికి కసరత్తు చేస్తోంది. ఇందుకోసం 'ఆరోగ్య మహిళ' అనే కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకురానుంది. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించనుంది. జిల్లాలోని ఏటూరునాగారం మండలం రొయ్యూర్ పీహెచ్‌సీ పరిధిలోని ఆకులవారిఘణపురం (రామాలయం వద్ద) పల్లె దవాఖాన, వెంకటాపురం(కె) మండలం ఎదిర సీహెచ్‌సీలో ప్రతీ మంగళవారం మహిళలకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఎనిమిది రకాల రుగ్మతలకు ఉచిత పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎనిమిది రకాల సమస్యలకు పరీక్షలు, చికిత్సలు చేయనున్నారు. మహిళా వైద్యులు ఉన్న ఆస్పత్రులను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది.



ఏటూరునాగారంలోని పల్లె దవాఖాన

ఏం ఏం పరీక్షలు చేస్తారంటే..

డయాగ్నోస్టిక్స్, నోటి రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ల స్క్రీనింగ్, సూక్ష్మపోషక లోపాల నిర్వహణ, చికిత్స, పాలిసిస్టిక్ ఓవేరియన్ డిసిజ్, సిండ్రోమ్, రుతు సమస్యలు, కుటుంబ నిర్వహణ ప్రణాళిక, మెనోపాజ్, యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్స్ పెల్విక్ ఇన్ఫెలమెంటరీ డీసీజ్, లైంగికంగా సక్రమించే అంటువ్యాధుల నిర్వహణ, బరువు పెరగడం వల్ల జరిగే అనార్థాలపై కౌన్సెలింగ్ పరీక్షలు చేయనున్నారు.

యాప్‌లో నమోదు..

పరీక్షల అనంతరం ఆరోగ్య మహిళ యాప్‌లో వివరాలు నమోదు చేస్తారు. ప్రతి పేషెంటుకు తన ఆరోగ్య పరిస్థితి, వైద్యం వివరాలతో కూడిన కేస్‌షీట్ ఇస్తారు. పరీక్షలు పూర్తయ్యాక మెరుగైన వైద్యసేవలు అవసరం అని భావిస్తే ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేస్తారు. మోనోపాజ్ సంబంధించి పరీక్షలు చేసి వారికి అవసరమైన సూచనలు ఇస్తారు. లైంగిక వ్యాధులకు సంబంధించిన పరీక్షలు కూడా చేస్తారు. మహిళలు ఎక్కువగా బరువు పెరిగినా మనోవేదనకు గురవుతుంటారు. వారికి కౌన్సెలింగ్ ఇచ్చి తీసుకోవాల్సిన జాగ్రత్తలు కూడా వివరించనున్నారు. అవసరమైన వారికి మమ్మోగ్రామ్, అల్ట్రాసౌండ్, కాల్పోస్కోపీ, క్రయోథెరపీ, పాప్ స్మేర్ పరీక్షలు చేయనున్నారు.

విస్తృత ప్రచారానికి ఆదేశాలు

ఆరోగ్య మహిళా కార్యక్రమంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి అప్పయ్యను ప్రభుత్వం ఆదేశించింది. మహిళలకు ప్రతి మంగళవారం పరీక్షలు నిర్వహిస్తారన్న విషయాన్ని స్వయం సహాయక సంఘాలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా తెలియజేయాల్సి ఉంటుంది. మహిళలు ప్రతి మంగళవారం అందుబాటులో ఉన్న డయాగ్నోస్టిక్ కేంద్రానికి వెళ్లేలా ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

రామప్పలో పర్యాటకుల సందడి



నంది విగ్రహం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

వెంకటాపురం(ఎం): రామప్ప దేవాలయం శనివారం విద్యార్థులు, పర్యాటకులతో సందడిగా మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు రామప్ప ఆలయం ఎటు చూసినా పర్యాటకులతో కిక్కిరిసిపోయింది. వందలాది సంఖ్యలో పర్యాటకులు సందర్శించి రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు హరీశ్ శర్మ, ఉమాశంకర్ పర్యాటకులకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్ విజయ్‌కుమార్ వివరించగా ఆసక్తిగా విని ఆనందం వ్యక్తంచేశారు. ఆలయంలో ఉత్సాహంగా కుటుంబసభ్యులతో, స్నేహితులతో కలిసి ఫొటోలు, సెల్ఫీలు దిగారు. అనంతరం రామప్ప సరస్సుకు చేరుకొని పర్యాటకశాఖ బోట్లలో బోటింగ్ చేసి ఆహ్లాదంగా గడిపారు.

వండర్ ఫుల్ టెంపుల్ రామప్ప..

వండర్ ఫుల్ టెంపుల్ రామప్ప అని ఇంగ్లండ్‌కు చెందిన బ్రూస్ అన్నారు. రామప్ప ప్రాముఖ్యతను టూరిజం గైడ్ విజయ్ కుమార్ ద్వారా తెలుసుకొని ఆనందం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామప్ప టెంపుల్ బ్యూటీఫుల్‌గా ఉందని, 800 సంవత్సరాల క్రితమే ఇంత అద్భుతంగా ఆలయం నిర్మించడం అప్పటి ఇంజనీరింగ్ గొప్పదనమన్నారు. ఈ సందర్భంగా పర్యాటకులు బ్రూస్‌తో ఫొటోలు దిగి ఆనందం వ్యక్తంచేశారు.



బ్రూస్‌తో ఫొటోలు దిగుతున్న పర్యాటకులు

జాతీయ రహదారిపై తనిఖీలు

వాజేడు: మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామ సమీపం జాతీయ రహదారిపై వెంకటాపురం(కె) సీఐ కాగితోజు శివప్రసాద్ ఆధ్వర్యంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులు శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణాలోకి వచ్చే ప్రతీ వాహనాన్ని తనిఖీ చెయ్యడంతో పాటు బ్యాగులను సోదా చేశారు. ప్రయాణికుల గుర్తింపు కార్డులను పరిశీలించి ఎక్కడి నుంచి వస్తున్నారు.. ఎక్కడికి వెళ్తున్నారని అడిగి తెలుసుకున్నారు.



మహిళా కేంద్రాల ఏర్పాటు

- వీసీలో వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు

ములుగు: మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల్లో ఈ నెల 8న మహిళా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. శనివారం హైదరాబాద్ నుంచి పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, సీఎస్ శాంతికుమారిలతో కలిసి కంటి వెలుగు, సీపీఆర్ శిక్షణ, వడ్డీలేని రుణాలు వంటి అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ కృష్ణ ఆదిత్య మాట్లాడుతూ అధికారుల సమన్వయంతో జిల్లాలోని 174 గ్రామ పంచాయతీలలో కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఓఎస్‌డీ అశోక్‌కుమార్, డీఎఫ్‌ఓ కృష్ణగౌడ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వైవీ గణేశ్, డీఆర్వో కూతాటి రమాదేవి, డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య, జిల్లా ఉద్యాన అధికారి బీవీ రమణ, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్, అదనపు డీఆర్డీఓ బాలకృష్ణ, ఏపీడీ వెంకట్‌నారాయణ, హెచ్‌ఈ సారంగపాణి, డీడీఎం ప్రదీప్‌కుమార్, కమలాకర్, ఫిరోజ్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అధికారులు

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు

ములుగు రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని గ్రామ పంచాయతీ గెస్ట్ హౌస్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో కార్నర్ మీటింగ్‌లను విజయవంతం చేసిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రం ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు కార్నర్ మీటింగ్‌లు ఉపయోగపడ్డాయని చెప్పారు. ఈ నెల 13న నియోజకవర్గంలోని బూత్ కమిటీ సభ్యులు బూత్ సమ్మేళనం సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ పటిష్టత, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి ఏవిధంగా తీసుకు వెళ్లాలనే విషయంపై కార్యక్రమానికి హాజరయ్యే అతిథులు దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ హుస్సేన్ నాయక్, యువజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు భాను ప్రకాశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అజ్మీర కృష్ణవేణి, జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, తాటి కృష్ణ, భూక్య రాజునాయక్, భూక్య జవహర్‌లాల్, నగరపు రమేష్, బలరాం, వెంకట సురేష్, ఉత్తమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గరికపాటి మోహన్‌రావు

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

వెంకటాపురం(ఎం): విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని గ్రంథాలయాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాలయంలో ఏఏ పుస్తకాలు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. స్కూల్ పిల్లల కోసం కొత్త పుస్తకాలు, పత్రికలు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. అనంతరం పాఠశాలలో వంటశాలలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అశోక్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జనగాం బాబురావు, ఎస్‌ఎంసీ చైర్మన్ చికూర్తి రమేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లింగాల రమణారెడ్డి, మాజీ ఎంపీటీసీ దగ్గు ప్రభాకర్ రావు, మధు పాల్గొన్నారు.



గ్రంథాలయాలను పరిశీలిస్తున్న గోవింద్‌నాయక్

ఇంజనీరింగ్ విద్యార్థులకే ఎంబీఏ

మార్కెట్ బడ్జెట్ ప్రతిపాదనలు ఆమోదం

ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌కు మార్చాలి

రుణాల రికవరీ వందశాతం సాధించాలి

డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు

- వివరాలు 10లో▸

ఓరుగల్లు వేదికగా రాష్ట్రస్థాయి వేడుక

- మహిళా దినోత్సవం నిర్వహణకు నిర్ణయం
- కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో ఏర్పాట్లు
- దిశానిర్దేశం చేసిన మంత్రి సత్యవతి

హన్మకొండ అర్బన్: ఓరుగల్లు వేదికగా రాష్ట్రస్థాయిలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని నిర్వహించడం గర్వంగా ఉందని రాష్ట్ర మహిళా, శిశు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాన్ని విజయవతం చేయాలని కోరారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లో కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆధ్వర్యంలో మహిళా అధికారుల సమావేశం నిర్వహించారు. అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కాకతీయ విశ్వవిద్యాలయంలో గల ఆడిటోరియంలో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమానికి సుమారు 2వేల మంది వచ్చే అవకాశం ఉందన్నారు. బందోబస్తు విషయంలో పోలీస్‌శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. పూర్తిస్థాయి ప్రొటోకాల్ పాటించాలని, సర్పంచ్ నుంచి, మంత్రి వరకు ప్రతి ఒక్కరూ సమన్వయం చేసుకోవాలన్నారు. సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా కాకతీయ తోరణం గల షీల్డ్‌లు, పోచంపల్లి శాలువాలను వినియోగించాలని మంత్రి సూచించారు. బొకేస్ కాకుండా మొక్కలను ఇవ్వాలన్నారు. జిల్లాలో జరుగుతున్న రాష్ట్ర పండుగను అందరూ ఇంటిపండుగగా చేసుకోవాలన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్ భారతి హోలీకేరి మాట్లాడుతూ విభిన్న శాఖల్లో పనిచేసే మహిళ ఉద్యోగులకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. సమావేశంలో వరంగల్ కలెక్టర్ గోపి, మున్సిపల్ కమిషనర్ ప్రావీణ్య, జెడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్, మేయర్ గుండు సుధారాణి, సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ దీపికారెడ్డి మహిళ శిశు సంక్షేమ శాఖ ఉన్నత అధికారులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి సత్యవతి, పక్కన భారతి హోలీకేరి, సిక్తా పట్నాయక్

కేయూ ఆడిటోరియం పరిశీలన..

కేయూ క్యాంపస్: వేడుకలను నిర్వహించతలపెట్టిన కేయూ ఆడిటోరియాన్ని అధికారులు పరిశీలించారు. వేదిక, పార్కింగ్, వేడుకలకు వచ్చేవారికి భోజనం ఏర్పాట్లు ఎక్కడ చేయాలనేది తదితర అంశాలపై చర్చించారు. మహిళా ఇంజనీరింగ్ కళాశాల వద్ద భోజనం ఏర్పాట్లు చేయనున్నారు. ఆ కళాశాలను కూడా సందర్శించి పరిశీలించారు.

మన ఐపీఎస్.. మన రాష్ట్రానికే

- హనుమకొండకు చెందిన చైతన్యరెడ్డి తెలంగాణకే కేటాయింపు
- ఆనందంగా ఉందంటున్న తండ్రి సంజీవరెడ్డి



హన్మకొండ: మన ఐపీఎస్‌ను.. మన రాష్ట్ర కేడర్‌కే కేటాయించారు. సివిల్స్‌లో అత్యుత్తమ ర్యాంక్ సాధించిన హనుమకొండకు చెందిన బొక్క చైతన్యరెడ్డి శిక్షణ కూడా ఇటీవల పూర్తయ్యింది. ఈ క్రమంలో ఆమెను తెలంగాణ కేడర్‌కు కేటాయిస్తూ కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వరంగల్ జిల్లా సహకార అధికారి బి.సంజీవరెడ్డి కూతురు అయిన చైతన్యరెడ్డి.. సివిల్స్‌లో 161వ ర్యాంకు సాధించారు. నీటి పారుదలశాఖలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తూ సివిల్స్ కొట్టాలనే పట్టుదలతో ప్రయత్నించి లక్ష్యాన్ని చేరుకున్నారు. చైతన్యను తెలంగాణకు కేటాయించడం పట్ల స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది.

సంతోషంగా ఉంది : సంజీవరెడ్డి, తండ్రి

నా కూతురు చైతన్యరెడ్డిని తెలంగాణ కేడర్‌కు ఎంపిక చేయడం ఎంతో సంతోషంగా ఉంది. ఆమె పడిన కష్టానికి ప్రతిఫలం దక్కినట్లయ్యింది. సివిల్స్ కొట్టాలని పట్టుదలతో చదివింది. అనుకున్న లక్ష్యాన్ని సాధించింది.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

వెంకటాపురం(ఎం): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ చైర్ పర్సన్ పీపీపీ లలితశివజ్యోతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని కేశవపూర్‌లో మహిళా చట్టాలపై అవగాహనా సదస్సు నిర్వహించగా ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. స్త్రీమూర్తులు ఆత్మగౌరవంతో స్వశక్తితో తమ ఆర్థిక అవసరాలను తామే స్వయంగా నిర్మించుకొని ఉన్నత స్థితికి చేరుకొని స్త్రీ శక్తిని ప్రపంచానికి తెలుపాలన్నారు. విద్య, వైద్య, వ్యాపారాలు, రాజకీయాలు, క్రీడలు, బ్యాంకింగ్, అంతరిక్షం, టెక్నాలజీతో పాటు ఇంటి బాధ్యతలు నిర్వర్తించే మహిళగా, గృహిణిగా పలు రంగాల్లో రాణిస్తూ మహిళా సాధికారత సాధన దిశగా అడుగులు వేస్తున్నారని వెల్లడించారు. పురుషులతో పాటుగా స్త్రీలకు కూడా సమానంగా అవకాశాలు, హక్కులు ఉన్నాయన్నారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థలు మహిళలకు, వృద్ధులకు, పిల్లలకు న్యాయపరంగా సహాయ చేయడానికి ఎల్లప్పుడూ కృషి చేస్తూనే ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి డి.రాంమోహన్‌రెడ్డి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జైసొఖ్య, జిల్లా పంచాయతీ ఆఫీసర్ వెంకయ్య, డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ ప్రేమలత, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బాలుగు చంద్రయ్య, న్యాయవాదులు సీహెచ్ వేణుగోపాలచారి, మేకల మహేందర్, కన్నోజు సునీల్ కుమార్, సీహెచ్.రాజేందర్, సర్పంచ్ కొయ్యల జయలక్ష్మి, సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లలితాశివజ్యోతి

జాగ్రత్తలతో సంపూర్ణ ఆరోగ్యం

- డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య

ములుగు: బాలికల సంపూర్ణ ఆరోగ్యం కోసం జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య అన్నారు. శనివారం మండలంలోని బండారుపల్లి మోడల్ పాఠశాలలో కేర్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కిశోర బాలికల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కౌమార దశలో బాలికలు ధృడంగా ఉండేందుకు నాలుగు సూత్రాలను పాటించాలని చెప్పారు. బాలికలు సమతుల్య ఆరోగ్యం, ఐరన్ సమృద్ధిగా ఉండే ఆహారం తీసుకోవాలని అన్నారు. బాలికలు రక్తహీనత, ఐరన్‌లోపం, నులిపురుగుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రేమలత, పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శోభారాణి, కేర్ ఇండియా జిల్లా కోఆర్డినేటర్ విజయ్, రమాదేవి, పరిపూర్ణ, చారి, సాయిప్రియ, రూప్‌సింగ్ అరుణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య

ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కు పొందాలి



మాట్లాడుతున్న ఏడీఎంహెచ్‌ఓ మదన్‌మోహన్

ఎంజీఎం: ట్రాన్స్‌జెండర్లు, నిస్సహాయ స్థితిలో ఉన్న మహిళలందరూ ఓటర్‌కార్డు కలిగి ఉండి ఓటు హక్కును వినియోగించుకోవాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ మదన్‌మోహన్ సూచించారు. శనివారం హనుమకొండ డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో స్వచ్ఛంద సంస్థలు, ట్రాన్స్‌జెండర్స్, నిస్సహాయ స్థితిలో ఉన్న మహిళలకు స్వీప్–ఓటర్ల చైతన్య కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత దేశంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును విధిగా ఫామ్–6లో నమోదు చేసుకుని ఎన్నికల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ మేనేజర్ స్వప్న మాధురి, డెమో అశోక్‌రెడ్డి ట్రాన్స్‌జెండర్ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు లైలా తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన విచారణ

రామన్నపేట: ప్రీతి ఆత్మహత్య ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సైఫ్‌ను పోలీసులు మూడో రోజు శనివారం సుదీర్ఘ విచారణ చేపట్టారు. శుక్రవారం 9 మంది వైద్యులను, వైద్య సిబ్బందిని విచారించిన పోలీసులు శనివారం మరో ముగ్గురి వైద్యులను విచారించారు. 16న ప్రీతి విధులు నిర్వర్తించిన డీఎంహెచ్ హౌస్ సర్జన్‌ను మరో ఇద్దరు పీజీలను విచారించి వివరాలు సేకరించారు. సైఫ్ పేర్కొంటున్న వివరాలతో పాటు వైద్యులను విచారిస్తూ పోలీసులు విచారణలో వేగం పెంచారు. ఆదివారంతో సైఫ్ కస్టడీ ముగిస్తుండంతో పోలీసులు తెల్లజామువరకు విచారణలో నిమగ్నమై విధులు నిర్వర్తిస్తున్నారు.

పోలీసులకు చేరింది..

ఫోరెన్సిక్ నివేదిక..టాక్సీకాలజీ నివేదిక

ప్రీతి ఆత్మహత్యకు పాల్పడటంలో అనస్తీషియా ఇంజక్షన్ తీసుకుందా..లేక ఇంకేదైనా కారణంతో ఈ ఘటన జరిగిందా అనే విషయంలో పోలీసులులో తుగా విచారణ చేస్తున్నారు. అయితే ఈ విషయంలో ఫోరెన్సిక్ నివేదికతో పాటు టాక్సీకాలజీ నివేదిక కీలకంగా మారనుంది. శనివారం పోలీసులకు ఈ రెండింటిలో ఏదో ఒక నివేదిక అందినట్లు తెలుస్తోంది. కానీ ఈ విషయాన్ని పోలీసులు బహిర్గతం చేయకుండా గోప్యంగా ఉంచుతూ విచారణ సాగిస్తున్నారు.

వరంగల్ అంటే ఇష్టం

- భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

నయింనగర్: పోరాటల పురిటిగడ్డ, చారిత్రాత్మక ఓరుగల్లు అంటే తనకు ఇష్టమని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. శనివారం హన్మకొండ కిషన్‌పుర చైతన్య డీమ్డ్ టు బీ విశ్వవిద్యాలయం 11వ స్నాతకోత్సవ కార్యక్రమం కులపతి డాక్టర్ సిహెచ్. వి.పురుషోత్తంరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల, వరంగల్ పేరు నిలబెట్టాలన్నారు. విలువైన సమయాన్ని వృథా చేయకుండా లక్ష్యసాధన కోసం కృషి చేయాలన్నారు. భారతీయ భోజనం ముఖ్యంగా గ్రామీణ భోజనం చేయాలని ఇంగ్లిష్ జంక్ ఫుడ్ ఆహారానికి అలవాటు కావద్దన్నారు. యోగా చేస్తే యోగ్యుడివి అవుతావని అనవసరంగా సెల్‌ఫోన్లతో సమయం వృథా చేయొద్దన్నారు. రాజకీయాలు



మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న వెంకయ్యనాయుడు

తప్పుదారి పడుతున్నాయని యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. మొదటిసారి పోటీ చేసినప్పుడు కొన్ని ఓట్లే వస్తాయని ప్రజాస్వామ్యంలో నమ్మిన సిద్ధాంతంతో విశ్రమించకుండా ప్రయత్నిస్తే గెలుపు వరిస్తుందన్నారు. ఇతర భాషలు నేర్చుకోండి మన భాషను మాత్రం మర్చిపోవద్దన్నారు. ఇంగ్లిష్ భాష కళ్లద్దాల వంటిదని అద్దాలు తీస్తే ఎలా ఉంటుందో మీకే తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో వరంగల్ నిట్ డైరెక్టర్ ఎస్.వి. రమణారావు, కులపతి ఆచార్య పురుషోత్తంరెడ్డి, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, ఉపకులపతి ఆచార్య జి.దామోదర్, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.రవీందర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ గాదె రాంబాబు, ఓఎస్డీ వీరవెంకటయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం డిగ్రీ, పీజీలో ర్యాంకులు పొందిన విద్యార్థులకు వెంకయ్యనాయుడు బంగారు పతకాలను అందించి అభినందించారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

గొట్లకొండలో అంతర్జాతీయ యోగా కేంద్రం

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- శ్రీరామచంద్ర మిషన్‌కు 180 ఎకరాల భూమి వితరణ..
- యోగా గురువు కమలేశ్ డి పటేల్ దాజీకి పత్రాలు అందజేత..

నెక్కొండ : మండలంలోని రెడ్లవాడ శివారు గొట్లకొండలో అంతర్జాతీయ యోగా కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. యోగా కేంద్రం ఏర్పాటుకు అవసరమున్న భూమిని ఇచ్చేందుకు శనివారం మంత్రి ముందుకు వచ్చారు. శ్రీ రామచంద్ర మిషన్‌కు చెందిన ప్రముఖ అంతర్జాతీయ యోగా గురువు కమలేశ్‌డి పటేల్ దాజీతో కలిసి గొట్లకొండ గుట్టల మధ్య ఉన్న 180 ఎకరాల భూములను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తమకు కుటుంబాల తరఫున వారసత్వంగా వస్తున్న భూములను కొలను వేంకటేశ్వరస్వామి ట్రస్టు, ఎర్రబెల్లి ట్రస్టు ద్వారా మంచి పని కోసం విరాళంగా ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. దీనికి సంబంధించిన భూముల పత్రాలను,



దాజీకి పత్రాలు అందజేస్తున్న మంత్రి ఎర్రబెల్లి

మ్యాప్‌లను కమలేశ్ డి పటేల్‌దాజీకి అందించామని పేర్కొన్నారు. ధ్యానంతో ఏగాగ్రత, జ్ఞాపకశక్తి, ఆత్మస్థైర్యం పెంపొందుతుందన్నారు. యోగా ఒక గొప్ప జీవన విధానమన్నారు. యోగాను విశ్వవ్యాప్తం చేసి అందరికి పరివ్యాప్తం చేయాలనే సంకల్పంతోనే తమ ట్రస్టు భూములను మహత్కార్యానికి ఇవ్వడం జరిగిందన్నారు. యోగా గురువు దాజీ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీరామచంద్ర మిషన్‌ను తెలంగాణలో విస్తరించాలని తలిచామన్నారు. తమ ఆలోచనలకు మంత్రి దయాకర్‌రావు ఉదారతను చాటుకున్నారని చెప్పారు. భూములను యోగా కేంద్రానికి వితరణగా ఇచ్చిన మంత్రి ఎర్రబెల్లికి, దాజీ కృతజ్ఞతలు తెలిపారు.

దొంగను పట్టించిన సీసీ కెమెరా

- చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు
- రూ.97వేలు, మొబైల్, బైక్ స్వాధీనం

కేసముద్రం: ఓ సొసైటీకి సంబంధించిన ఎరువుల గోదాంలో, చోరీకి పాల్పడిన ఓ వ్యక్తిని సీసీ కెమెరా ఆధారంగా గుర్తించి పోలీసులు అరెస్టు చేసిన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని ధన్నసరి పీఏసీఎస్‌కు సంబంధించిన ఎరువుల గోదాంలో తలుపులు పగులగొట్టి, ఈనెల 1న రాత్రి గుర్తుతెలియని వ్యక్తి రూ.1.20 లక్షలను అపహరించిన విషయం తెలిసిందే. ఈ మేరకు సీసీ కెమెరాను పరిశీలించిన పోలీసులు మండలంలోని ఉప్పరపల్లికి చెందిన సకినాల



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న డబ్బులను చూపుతున్న ఎస్సై రమేష్‌బాబు

సాయికుమార్‌గా గుర్తించారు. ఈ మేరకు అతడిని మండల కేంద్రంలో పట్టుకుని అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.97వేలు, మొబైల్ ఫోన్, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్యపై దాడి చేసిన భర్త అరెస్ట్

మహాముత్తారం: వివాహేతర సంబంధం పెట్టుకుందనే అనుమానంతో భార్యపై కత్తితో దాడి చేసిన భర్తను శనివారం స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. వారి కథనం ప్రకారం మండలంలోని స్తంభంపల్లి(పీపీ) గ్రామానికి చెందిన చంద్రగిరి బొందయ్య మొదటి భార్య శంకరమ్మను ఫిబ్రవరి 22న ఇంట్లో ఉన్న ఆమెను కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. కొడుకు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు



నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్సై సుధాకర్

నమోదు చేసుకుని దర్యాప్తు చేసి శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఇన్‌చార్జ్ ఎస్సై సుధాకర్ తెలిపారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

- ప్రీతిది ఆత్మహత్య కాదు.. ముమ్మాటికి హత్యే
- ఆలిండియా బంజారా సేవాసంఘ్ నిజనిర్ధారణ కమిటీ వెల్లడి

కొడకండ్ల : పీజీ వైద్య విద్యార్థిని ప్రీతి మృతిపై కుటుంబ సభ్యులకే కాకుండా సమాజానికి అనేక అనుమానాలు ఉన్నాయని సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించి దోషులపై చట్టరీత్యా చర్యలు తీసుకొని ప్రీతి కుటుంబానికి న్యాయంచేయాలని మాజీ మంత్రి, ఆలిండియా బంజారా సేవాసంఘ్ జాతీయ అధ్యక్షుడు అమర్‌సింగ్ తిలావత్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని గిర్నితండలో ప్రీతి కుటుంబ సభ్యులను నిజనిర్ధారణ కమిటీ బృందంతో కలిసి ఆయన పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ పేరుతో ప్రీతి హత్యను ఆత్మహత్యగా చిత్రీకరిస్తూ పక్కదారి పట్టిస్తున్నారన్నారు. ప్రధానంగా ప్రీతి ఫోన్ నుంచి తండ్రికి ఫోన్ చేసిందెవరు, సీసీ కెమెరా ఫుటేజీలను ఎందుకు చూపడంలేదు, ప్రాథమిక సాక్ష్యాలను సేకరించారా, నిమ్స్‌లో ప్రీతికి చికిత్స



ప్రీతి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నిజనిర్ధారణ కమిటీ

వివరాలు ఎందుకు తెలుపడం లేదని ఆయన ప్రశ్నించారు. ర్యాగింగ్ పదాన్ని వాడి చిన్నచిన్న సెక్షన్లతో తప్పించాలనే ప్రయత్నాలు మానుకోవాలని, తమ నిజనిర్ధారణ కమిటీ భావిస్తున్నందున హత్యగా కేసు విచారణ జరిపి దోషులందరిని గుర్తించి శిక్షించాలన్నారు. ప్రీతి కుటంబానికి న్యాయం జరిగేంతవరకు పోరాడుతామని తెలిపారు. సమావేశంలో నిజనిర్ధారణ కమిటీ సభ్యులు నాగేశ్వర్‌రావు చౌహాన్, గుగులోత్ వెంకన్న, బట్టు వెంకన్న చౌహాన్, ధనుంజయనాయక్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.5 కోట్లు ఎక్స్‌గ్రేషియా అందించాలి : బీసీ సంక్షేమ సంఘం



ప్రీతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

ప్రీతి మృతికి కారకుడైన సైఫ్‌పై హత్య కేసు నమోదు చేసి ప్రిన్సిపాల్, హెచ్ఓడీ, సూపరిండెంట్‌లను తక్షణం సస్పెండ్ చేయాలని, ప్రీతి కుటుంబానికి రూ.5 కోట్లు ఎక్స్‌గ్రేషియా, ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణగౌడ్ డిమాండ్ చేశారు. శనివారం గిర్నితండలో ప్రీతి కుటుంబసభ్యులను సంఘ నాయకులతో కలిసి పరామర్శించి ప్రీతి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన వెంట రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్య, విద్యార్థి సంఘం కేయూ ఇన్‌చార్జ్ నాగరాజుగౌడ్, గుండగాని వేణు, మురళీ, రాకేష్, శ్రీకాంత్, నాగార్జునలు పాల్గొన్నారు.

కుంటలో పడి విద్యార్థి మృతి



రిశాంత్ (ఫైల్)

ములుగు రూరల్(గోవిందరావుపేట): కుంటలో పడి విద్యార్థి మృతి చెందిన సంఘటన గోవిందరావుపేట మండలం చల్వాయిలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. చల్వాయికి చెందిన అల్లం స్వాతి–స్వామి దంపతుల కుమారుడు రిశాంత్ (7) గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 2వ తరగతి చదువుతున్నాడు. ఉదయం 8.30 సమయంలో రిశాంత్ పాఠశాలకు చేరుకున్నాడు. తరగతి గదిలో బ్యాగ్ ఉంచి మరో విద్యార్థి వరుణ్‌తో కలిసి సమీపంలోని శంకర్‌రావు కుంటవద్దకు బహిర్భూమికి వెళ్లారు. తరగతి ఉపాధ్యాయుడు హాజరు తీసుకునే క్రమంలో రిశాంత్, వరుణ్‌లు క్లాస్‌లో లేకపోవడంతో విషయం తోటి విద్యార్థులను అడుగగా బయటకు వెళ్లారని సమాధానం చెప్పారు. ఈ క్రమంలో రిశాంత్‌తో బయటకు వెళ్లిన వరుణ్ వచ్చి రిశాంత్ కుంటలో నీటిలో మునిగాడని తెలిపాడు. ఉపాధ్యాయుడు, తల్లిదండ్రులు కుంట వద్దకు వెళ్లి బాలుడిని వెతుకగా మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పస్రా సీఐ శంకర్, ఎంఈఓ గొంది దివాకర్‌లు పరిశీలించారు. మృతుడి తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై నరోత్తమ్‌రెడ్డి తెలిపారు.

దళితబంధు విధులనుంచి తప్పించండి

- ఎంపీడీఓ, డీపీఓకు వినతిపత్రాలు అందజేసిన కార్యదర్శులు


కమలాపూర్: దళితబంధు పథకానికి సంబంధించిన విధుల నుంచి తమను తప్పించాలని హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల పంచాయతీ కార్యదర్శులు కోరారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీఓ పల్లవి తోపాటు డీపీఓ జగదీశ్వర్, కలెక్టర్ సిక్తాపట్నాయక్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు మెయిల్ ద్వారా పంపారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం దళితబంధు పథకానికి సంబంధించి ఇటీవల ఒక కొత్త యాప్ తీసుకొచ్చిందని, ఆ యాప్ ద్వారా దళితబంధు పథకంలో గ్రౌండింగ్ అయిన యూనిట్లను ఫొటోలు తీసి పంపించాలని ఆదేశించిందని తెలిపారు. కానీ ఆ యూనిట్లు స్థానికంగా కాకుండా ఎక్కడెక్కడో ఉన్నాయని, కొన్ని దళితబంధు వాహనాలను చాలా మంది లబ్ధిదారులు అమ్ముకున్నారని, మరికొందరు ఇతరులకు లీజుకు ఇచ్చారని వాపోయారు. షాప్స్ విషయానికి వస్తే ఒక్కో షాపుపై ముగ్గురు, నలుగురు చొప్పున క్లెయిమ్ చేసుకున్నారని, దీనిపై కార్యదర్శులు లబ్ధిదారులను అడిగితే వారు స్పందించడం లేదని, వాటిని తాము ఫోటోలు తీసి పంపించలేమని స్పష్టం చేశారు. ఆ విధులు తాము నిర్వహించలేమని, వినతిని రాష్ట్ర ప్రభుత్వం సహృదయంతో ఆమోదించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ క్యాదర్శులు శ్రీనివాస్, విద్యాసాగర్‌రెడ్డి, చైతన్య, వినీల్, కుమారస్వామి, విజయ్‌కుమార్, సాహిత్‌రెడ్డి, రాజారాం, శ్రీనివాస్, ఝాన్సీ, భగవాన్‌రెడ్డి, సౌమ్య, శరత్, విజయ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

రెండో రోజు యోగా మహోత్సవం

హన్మకొండ కల్చరల్ : హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గ్రౌండ్స్‌లో యోగా మహోత్సవం శనివారం రెండో రోజు కొనసాగింది. పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ తదితరులు హాజరయ్యారు. రాష్ట్ర హార్ట్‌ఫుల్‌నెస్ కన్వీనర్ బ్రదర్ బాబు గుర్రం ఆధ్వర్యంలో యోగాసనాలు, ముద్రలకు సంబంధించిన విషయాలను వివరించారు. నగరప్రజలు, విద్యార్థులు, వివిధ శాఖల అధికారులు అధిక సంఖ్యలో పాల్గొని శిక్షణ నిపుణుల ద్వారా యోగా, ధ్యానం ఆచరించారు.



యోగాసనాలు వేస్తున్న అభ్యాసకులు

తయారీదారుల దోపిడీపై దృష్టి సారించాలి

- ఢిల్లీలో రూ.210, తెలంగాణలో రూ.370లకు మద్యం విక్రయం
- వినియోగదారుల మండలి ఫిర్యాదు

వరంగల్: ఒకే సంస్థ తయారు చేసిన మద్యం బాటిల్‌ను ఢిల్లీలో రూ.210లకు, తెలంగాణ రాష్ట్రంలో రూ.370లకు క్వాటర్ ఓక్ స్మిత్ గోల్డ్(ఐఎంఎఫ్ఎల్)బాటిల్‌ను రెండు ప్రాంతాల్లో వేర్వేరు ధరల్లో విక్రయించడంపై లీగల్ మెట్రాలజీ చట్టం 2017 సెక్షన్ 18 (2ఎ) నుంచి 18 (51) వరకు ఉన్న పరిధిలో సత్వర చర్యలు తీసుకోవాలని వినియోగదారుల మండలి జాతీయ కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్ కోరారు. శనివారం వరంగల్ లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ అనిల్‌కుమార్‌కు మద్యం తయారీదారుల దోపిడీ విధానంపై ఫిర్యాదు చేశారు. ఒకే రకమైన ఉత్పత్తి, ఒకే సంస్థతో తయారు చేసి వేర్వేరుగా ఎంఆర్‌పీ ముద్రించి అమ్మడం అనుచిత వ్యాపార పద్ధతిగా పరిగణించాలన్నారు. ఎక్కువ ధరలకు కొనుగోలు చేసిన వినియోగదారులు మోసపోతున్నారని వారి



లీగల్ మెట్రాలజీకి ఫిర్యాదు చేస్తున్న వినియోగదారుల మండలి నాయకులు

ప్రతినిధులుగా ఫిర్యాదు చేస్తున్నామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మద్యం బార్ షాపుల్లో వివిధ రకాల మద్యం తక్కువ కొలతలతో అమ్ముతున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. లీగల్ మెట్రాలజీ అధికారులు దాడులు నిర్వహించి జరిమానాలు వసూలు చేసినా యథాతథంగా దందా జరుగుతోందన్నారు. బార్ షాపుల్లో క్వాటర్, హాఫ్ బాటిల్స్ అమ్మే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లూజ్ అమ్మకాలు అరికడితే కల్తీ మద్యం, తక్కువ కొలతల సమస్య ఉండదని వారు అనిల్‌కుమార్‌కు తెలిపారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

- నిందితుడిని పట్టుకున్న రైల్వేపోలీసు
- ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అప్పగింత

కాశిబుగ్గ : వరంగల్ రైల్వేస్టేషన్ ఆవరణలోని ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి విఫలయత్నం జరిగింది. శనివారం తెల్లవారుజామున ఓ వ్యక్తి రాయితో ఏటీఎంను ధ్వంసం చేస్తుండగా రైల్వేపోలీస్ ఎం.నాగరాజు అడ్డుకుని ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అప్పగించాడు. ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం..బీహార్ రాష్ట్రం మధుబని జిల్లా పాండౌల్ బ్రహ్మమోత్రకు చెందిన అజిత్ దాస్(28) ఇంట్లో భార్యతో గొడవ పెట్టుకుని రైలులో వరంగల్‌కు వచ్చాడు. ఈక్రమంలో చేతిలో డబ్బులు లేకపోవడంతో స్టేషన్‌లోని ఏటీఎంలో దొంగతనం చేయడానికి నిర్ణయించుకున్నాడు. రాయితో ఏటీఎంను ధ్వంసం చేసి డబ్బులు తీస్తూ ప్రయత్నిస్తుండగా డ్యూటీలో ఉన్న జీఆర్పీ పోలీసు ఎం.నాగరాజు గమనించి నిందితుడిని పట్టుకుని అప్పగించినట్లు ఇంతేజార్‌గంజ్ పోలీసులు తెలిపారు. ఎస్‌బీఐ మేనేజర్ విలియం క్యారీ ఫిర్యాదు మేరకు నిందితునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నిందితుడిని సాయంత్రం రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.



నిందితుడు అజిత్ దాస్



చోరీకి ప్రయత్నించిన ఎస్‌బీఐ ఏటీఎం

లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిపై హత్యాయత్నం

- పోలీసుల అదుపులో లారీ డ్రైవర్, క్లీనర్
- బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు

ఖిలావరంగల్ : ది వరంగల్ జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేముల భూపాల్‌పై గుర్తుతెలియని వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి లేబర్‌కాలనీలోని 100 ఫీట్ల రోడ్డులో చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. వరంగల్ శంభునిపేట విశ్వనాథ కాలనీకి చెందిన వేముల భూపాల్ జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేస్తున్నాడు. ఎనుమాముల మార్కెట్ సమీపంలో లారీ పార్కింగ్ స్థలం నుంచి రాత్రి 12 గంటలకు బైక్‌పై భూపాల్ ఇంటికి బయల్దేరాడు. లేబర్‌కాలనీ 100 రోడ్డు మీదుగా వస్తున్న క్రమంలో ఏపీ 01 ఎక్స్ 7829 నంబర్‌గల లారీ బైక్‌ను వెంబడిస్తూ ఢీకొట్టేందుకు యత్నించగా బైక్‌ను వదిలేసి రోడ్డుపక్కకు దూకేశాడు. తేరుకున్న భూపాల్ ఇతర లారీ ఓనర్లకు కాల్‌చేసి లారీ పట్టుకునేందుకు లారీని వెంబడించాడు. లారీ వేగంగా చింతల్ ప్లైఓవర్ బ్రిడ్జిపై నుంచి ఫోర్ట్‌రోడ్డు, ఆర్టీఏ జంక్షన్ మీదుగా ఉర్సుగుట్ట జంక్షన్ చేరుకోగానే లారీఓనర్లు రోడ్డుకు అడ్డంగా భారీగేడ్లు పెట్టి లారీని నిలిపివేశారు. లారీని వదిలేసి డ్రైవర్ దిగి పారిపోగా క్లీనర్ పట్టుపడ్డాడు. అక్కడే పెట్రోలింగ్ గస్తీలో పోలీసులు డ్రైవర్‌ను పట్టుకున్నారు. లారీ ఓనర్లు లారీతో పాటు బీహార్‌కు చెందిన డ్రైవర్, క్లీనర్‌ను మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు. బాధితుడు భూపాల్ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ముష్క శ్రీనివాస్ తెలిపారు.



పట్టుబడిన లారీ డ్రైవర్, క్లీనర్